## రేపు ఆయుర్వేద వైద్యశిబిరం

ఇల్లెందు రూరల్, జూలై 22: స్థానిక జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తారన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబసభ్యులు, ఇల్లెందు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పామాయిల్ మొక్కలకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

దమ్మపేట రూరల్, జూలై 22: వర్షాలు తగ్గగానే పామాయిల్ మొక్కలకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆయిల్‌ఫెడ్ విశ్రాంత అధికారి రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల మొగికుళ్లు తెగులుతో మొక్కలు చనిపోయే అవకాశం వుందన్నారు. మొక్కలను రక్షించుకునేందుకు 1.5ఎంఎల్ లాంబ్డా, 2 గ్రాముల బావిస్టిన్‌ను లీటరు నీటిలో వేర్వేరుగా కలిపి మొక్క మొగి తడిసే విధంగా పోయాలన్నారు. దీని ద్వారా మొక్కలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు.

## ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం

ఇల్లెందు రూరల్, జూలై 22: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు సమావేశానికి మూడు నెలల ప్రగతి నివేదికలను తెలుగులో టైపు చేయించి తీసుకురావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారుల వివరాలను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శిరీష

టేకులపల్లి, జూలై 22: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష హెచ్చరించారు. శనివారం మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని సందర్శించారు. తొలుత వైద్య సిబ్బంది హాజరు, అవుట్,ఇన్ పేషంట్ల వివరాలు, ప్రతి రోజూ నమోదవుతున్న రికార్డు, జ్వర పీడితుల వివరాలు తనిఖీ చేశారు. ప్రసూతి గది, వార్డులు,ల్యాబ్‌ని పరిశీలించారు. అనంతరం ఆమె వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై, కలుషిత ఆహారం, నీరు తీసుకున్నపుడు కలిగే నష్టాలను ప్రజలకు తెలపాలన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న టీ హబ్ ద్వారా 134 రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరవ్వాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, వైద్యాధికారి డాక్టర్ రవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సీతమ్మ, పార్వతి, వేదమణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి: రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో శిరీష

### గర్భిణులకు టిఫా స్కాన్ తప్పనిసరిగా చేయాలి

ఇల్లెందు రూరల్, జూలై 22: గర్భిణులకు టిఫా స్కాన్‌ను తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. శనివారం మండలంలోని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీలు, ఇల్లెందు సీహెచ్‌సీ, టీబీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. గర్భిణులకు టిఫా స్కాన్‌ను తప్పనిసరిగా చేయాలని, నిర్లక్ష్యం వహించవద్దని ఇల్లెందు రేడియాలజిస్ట్ డాక్టర్ మాధురికి సూచించారు. అనంతరం ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఘటన వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శిరీష్, సింధు, కొమరారం వైద్యురాలు ప్రియాంక, ఎల్‌టీ సాజిదాబేగం, స్టాఫ్‌నర్సు ఆశాజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

# యాదవులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

దమ్మపేట, జూలై 22: మండలంలో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని తాటిసుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావునునివాసంలో కలిసి యాదవ సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదవులు మాట్లాడుతూ మండలంలో ఐదు వేల మందికి పైగా యాదవులు ఉన్నారని, సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. రెండో విడతలో మండలంలో కొంతమందికి గొర్రెల పంపిణీ నిలిచిపోయిందని ఎమ్మెల్యేకు వివరిస్తూ అందరికీ గొర్రెల పంపిణీ చేపట్టాలని సూచించారు. స్పందించిన ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ యాదవ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషిచేస్తానని, అధికారులతో మాట్లాడి గొర్రెలు పంపిణీ చేయిస్తానన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జోను బోయిన శ్రీనివాసరావు, నూనె శ్రీనివాసరావు, నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, మల్లాది గంగరాజు, రాచూరి వేణుగోపాలరావు, కోట వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కోట రాజీవ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మెచ్చాకు వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘ నాయకులు

## శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి, జూలై 22: స్థానిక శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శనివారం ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజలు చేసి, కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇల్లెందు, జూలై 22: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పాత ఇల్లెందు ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో రొంపేడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కవిత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా స్కూల్ పిల్లలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి, జలుబు, కడుపునొప్పి, విరేచనాలు తదితర సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. వేడి ఆహారంతో పాటు కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం యూఎఫ్‌డబ్ల్యూసీ సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు 54 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏటీడీవో బీ రూపాదేవి, ప్రిన్సిపాల్ పద్మావతి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు జ్ఞానేశ్వరి, సింధు, ఆశ కార్యకర్తలు రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## మొద్దులమాడలో వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

అశ్వారావుపేట రూరల్, జూలై 22: మండలంలోని మొద్దులమాడలో నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో అశ్వారావుపేట పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు 28 మంది రోగులను పరీక్షించి, రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు బిర్రం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటికెళ్లి మురుగు నీరు తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెచ్‌ఈవో రాజు, ఏఎన్ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పచ్చని తెలంగాణయే హరితహారం లక్ష్యం



మొక్కలు అందజేస్తున్న జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్

చండ్రుగొండ, జూలై 22: పచ్చని తెలంగాణయే హరితహారం లక్ష్యమని జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్ అన్నారు. శనివారం తిప్పనపల్లి పంచాయతీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామస్తులకు మొక్కలు అందజేసి మాట్లాడారు. ప్రతి ఇల్లు పచ్చని చెట్లతో కళకళలాడనే సదుద్దేశంలో ఇంటింటికీ మొక్కలను అందజేశామన్నారు. ఇచ్చిన ప్రతి మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ పార్వతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమన్నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి, జూలై 22: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో వీరబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు, వికలాంగులు, ఒంటరి మహిళ కుటుంబాలకు పాధాన్యత ఇస్తారన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డ్, బోరు, బావితో పాటు కరెంట్ సదుపాయం కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఉపాధిహామీ పథకం జాబ్ కార్డ్, ఆధార్ కార్డుతో అనుసంధానమైన బ్యాంక్ అకౌంట్ ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ నెల 31వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, సాంకేతిక, క్షేత్ర సహాయకులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ

చండ్రుగొండ, జూలై 22: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ అన్నారు. శనివారం చండ్రుగొండ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొన్ని రోజులుగా కురిసిన వానలకు నీటి నిల్వలు ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు అధికంగా ఉంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చేపలు పడితే చర్యలు తప్పవు

ఇల్లెందు, జూలై 22: మండలంలోని ఇల్లెందులపాడు చెరువులో ఎవరైనా చేపలు పడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అంకుషావలి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాత ఇల్లెందులపాడులోని చెరువులో కొంతమంది వలలు వేసి చేపలు పడుతున్నారన్న సమాచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. చేపలు పట్టే విషయాన్ని తమకు సమాచారమివ్వాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

# మణిపూర్ ఘటన దేశానికి మాయని మచ్చ



ప్రదర్శన చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అశ్వారావుపేట, జూలై 22: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం అశ్వారావుపేటలో ప్రజాపంథా ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రజాపంథా కార్యాలయంలో బాడిస లక్ష్మణరావు అధ్యతన జరిగిన నిరసన సభలో పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, నాయకులు కంగాల కల్లయ్య మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా కుకీలకు, మైతిలకు మధ్య జరుగుతున్న వివాదం ప్రధాని మోదీ అసమర్థతకు నిదర్శనమన్నారు. మహిళలను నగ్నంగా సభ్యసమాజం సిగ్గుపడేలా ఊరేగించి లైంగికదాడికి పాల్పడి హత్య చేయటమనేది ప్రపంచంలో భారత్ సిగ్గుతో తలదించుకునే ఘటనగా వర్ణించారు. ఈ ఘటనకు మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు, గోకినపల్లి గంగా, కంగాల భూలక్ష్మి, కుంజా అర్జున్, కాకా బాబురావు, జెడ్డి నారాయణ, తెల్లం సత్యం, కాకా లక్ష్మణరావు, కారం వెంకటేశ్, కురం రాము, కబ్బాడి కవిత, జోడె ముత్తమ్మ, సన్యాసి ముత్తమ్మ పాల్గొన్నారు.

# గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి, జూలై 22: తాము గిరిజనులకు వ్యతిరేకం కాదని, తరతరాలుగా గిరిజనేతరుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు గిరిజనేతరుల సంఘం సభ్యుడు పులిగండ్ల మాధవరావు, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడినుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ లంకపల్లి వీరభద్రంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాలది అప్పారావు, ఉప సర్పంచ్ సురేశ్, నాయకులు ధర్మపురి వీరబ్రహ్మాచారి, గుడిపూడి మోహన్‌రావు, ఉదయ్, ఈసాల ఆదాం, లక్కినేని వెంకటేశ్వరరా వు, సింగం చిన్న రాజేశ్వరరావు, కొంగల సత్యనారాయణ, ఎండీ హనీఫ్, ఆమెడ వెంకన్న, నర్సింగ్ లక్ష్మయ్య, పెరుగు సత్యనారాయణ, వేముల రామ్మూర్తి, గాడేపల్లి రాములు, గుండా నర్సింహారావు, అంబాల మోహన్, యసరపు జనయ్య, గంగారపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.